క్లుప్తంగా

మరిడమ్మ ఆలయ హుండీల లెక్కింపు



మరిడమ్మ ఆలయంలో హుండీల లెక్కింపులో పాల్గొన్న ఆలయ అధికారులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి హుండీల ద్వారా 34 రోజులకు రూ.13,98,965 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, ఈఓ పళ్లంరాజు సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హుండీలను లెక్కించగా అమ్మవారి ఆలయానికి అన్నదానం ద్వారా 16,516, హుండీల ద్వారా రూ.13,82,449 కలిపి మొత్తం 13,98,965 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ విజయశంకర్

పెద్దాపురం: మాదవ ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, రహదారి భద్రదతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రహదారి భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సత్యనారాయణ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుపై కేసు నమోదు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో ఎరువుల కొరత ఉందనే వార్తలపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. వేట్లపాలెంలోని శ్రీసత్యసాయి ఏజెన్సీ షాపును తనిఖీ చేయగా 23 బస్తాల యూరియా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పాస్ ద్వారా 20 బస్తాలు నిల్వ ఉన్నట్టు రికార్డయింది. మూడు బస్తాలు వ్యత్యాసం ఉండటంతో జాయింట్ కలెక్టరు 6ఏ కేసు నమోదు చేసినట్టు ఏఓ వి.మురళీధర్ తెలిపారు. వ్యవసాయశాఖ ఏడీఏ, విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

బోట్‌క్లబ్: తాళ్లరేవు మండలంలోని జాతీయ రహదారి 216 ప్రమాదాలకు నిలయంగా మారిందని, నిత్యం అనేక మంది ప్రజలు ఈ ప్రమాదాల్లో మరణిస్తున్నారని దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ తాళ్లరేవు మండల పరిసర ప్రాంతాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మధ్యకాలంలో జులై, ఆగస్టు నెలల్లో 10 రోడ్డు ప్రమాదాలు జరిగాయని సుమారు 20 మందికి పైగా మృత్యువాత పడ్డారని ఆందోళనకారులు వివరించారు. ఈ జాతీయ రహదారి పూర్తి స్థాయిలో నిర్మాణం కాకపోవడం, హైవే అథారిటీ వారు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడం, యానాంలో మద్యం తాగి వాహనాలు నడపడం అనేక ప్రమాదాలకు కారణం అవుతూ ఎక్కువ మంది చనిపోతున్నారన్నారు. 216 జాతీయ రహదారి కాకినాడ నుంచి అమలాపురం వరకు పైలట్ ప్రాజెక్టు ప్రారంభించాలని, రేడియం సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్ నిరంతరం నిర్వహించాలని, బ్లాక్‌స్పాట్ బోర్డులను పెట్టాలని, 216 నేషనల్ హైవే 4 లేన్స్ విస్తరణ పని వెంటనే ప్రారంభించి డివైడర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం నేషనల్ హైవేలో యానాం పరిధిలో మద్యం షాపులను తొలగించాలన్నారు. ప్రమాదభరిత కూడలిలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టింగ్‌లను కఠినతరం చేయాలని, తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని, వాహనాల స్పీడు నియంత్రణ రీడింగ్ మెషీన్లను ఏర్పాటు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- సుందరంగా ముస్తాబైన ఆలయాలు
- ఊరూవాడ మండపాల ఏర్పాటు
- కళకళలాడిన దుకాణాలు

పిఠాపురం: గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు, మండపాలు సిద్ధమయ్యాయి. బుధవారం వినాయక చవితి కావడంతో పూజల కోసం రెండు రోజుల ముందుగానే సోమవారం నుంచి వినాయక ప్రతిమలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు రావడంతో పిఠాపురంలో దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మండపాలలో నిలిపేందుకు వివిధ సైజుల్లో ఉన్న వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు భక్తులు అధికంగా రావడంతో విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. పలుచోట్ల వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేసి పర్యావరణాన్ని కాపాడాలని నినాదాలు చేసారు. పిఠాపురం నియోజక పరిధిలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు తదితర మండలాల పరిధిలో వినాయక మండపాలు నిర్మించి చవితి ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేసారు. పలువురు వాహన యజమానులు తమ వాహనాలను ప్రత్యేక పూజల కోసం శుభ్రం చేసి అలంకరించే పనిలో నిమగ్నమయ్యారు.



వినాయక విగ్రహాలను మండపాలకు తరలిస్తున్న నిర్వాహకులు



విక్రయానికి సిద్ధమైన పూజా సామగ్రి



పిఠాపురంలో అలంకరణ వస్తువుల దుకాణాలు

ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

వినాయక చవితి సందర్భంగా వినాయక మూర్తులు, పత్రి, పండ్లు, అమ్మకానికి సిద్ధం చేసారు. వినాయక ప్రతిమలు, విగ్రహాల విక్రయాలు జోరుగా సాగాయి. పండ్లు, పత్రిల ధరలు భారీగా పెరిగాయి. మామిడి, జామ, ఉత్తరేణి, ఉసిరి, సీతాఫలం, మారేడు తదితర పత్రిలు కాయలతో కలిపి రూ.100 వరకు ధర పలుకుతున్నాయి. బత్తాయి ఒక్కోటి రూ. 10, దానిమ్మ రూ.30, యాపిల్ రూ.30, ఉసిరి, జామ, ద్రాక్ష, మొక్కజొన్న, ఎలక్కాయ, అరటిపండ్లు తదితర పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. ముఖ్యంగా చవితి రోజున వినాయక ప్రతిమ వద్ద చెక్కతో తయారు చేసిన పాలవెల్లిని వివిధ రకాల పండ్లు, పత్రితో అలంకరిస్తారు. పాలవెల్లిల అమ్మకాలు ఉపందుకున్నాయి. పూల దండలకు గిరాకీ పెరిగింది. రూ.20 విలువచేసే పూల దండ రూ.100 వరకు ధర పలికింది. ఇప్పటికే వినాయక ఉత్సవాల్లో అలంకరించే రంగురంగుల కాగితాలు పూలు పూల దండలు అమ్మకాలు జోరుగా సాగాయి. పిఠాపురం కోటగుమ్మం సెంటర్లోని జై గణేష్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా పలువురు భక్తులు వినాయక మాలధారణ చేసి దీక్ష చేపట్టారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పోలీసుల సూచనలు పాటించాలి

పందిళ్లు, మండపాల ఏర్పాటుకు కమిటీ ఏర్పాటు చేసి పోలీస్ అనుమతి తీసుకోవాలి.మండపం ఏర్పాటు చేసే స్థలం యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే అధికారుల అనుమతి తప్పనిసరి. ఫైర్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకుని రక్షణ చర్యలు పాటించాలి. అగ్ని ప్రమాదాలు జరగకుండా విద్యుత్, దీపారాధన వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి. విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవం రోజులు, నిమజ్జన మార్గం పోలీస్ వారికి ముందుగానే తెలియజేయాలి. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదు.

> **మండపాల వద్ద కాపలా ఉండాలి**
>
> మండపాల వద్ద డబ్బు, బంగారం ఉంచరాదు. రోడ్డు మీద పందిళ్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టరాదు. ఊరేగింపులో ఇతర మతాలు, కులాలు, రాజకీయాలపై నినాదాలు చేయరాదు. అసభ్య నాట్యాలు, మద్యం, మత్తు పదార్థాలు నిషేధం. పోలీస్ అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా వాడరాదు. తోటి వారికి ఇబ్బంది లేకుండా భక్తి పూర్వకంగా ఉత్సవాలు నిర్వహించడానికి అందరూ సహకరించాలి.
>
> – శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

మట్టి గణపతి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



సామర్లకోటలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ, తహసీల్దార్లు



కొత్తపల్లిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

సామర్లకోట: మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేయడం ద్వారా పర్యావరణ పరిక్షణ చేసుకొవడానికి అవకాశం ఉంటుందని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక స్టేషన్ సెంటర్‌లో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మట్టి గణపతి ప్రతిమలు నీటిలో కరుగుతాయన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులు వేసిన విగ్రహాల వలన కాలుష్యం పెరుగుతుందన్నారు. ప్రజలలో చైతన్యం పెంచడానికి 15 ఏళ్లుగా రామకృష్ణ సేవా సమితి ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలకు పూజలు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన కరపత్రాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, కౌన్సిలర్ స్వయం భారపు వీరభద్రరావు, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, అడపా వెంకట్రావు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పూజించాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ గణపతి నవరాత్రులకు మట్టి ప్రతిమలు, విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. స్థానిక వీవీఎస్ విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు, వ్యాపారులకు మట్టి ప్రతిమలను సోమవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణపతి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్, పలు రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం వలన తాగునీటి వనరులు కలుషితవుతాయని ఆయన అన్నారు. సిద్ధమవుతున్న మందిరాలు: మండలంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి మహోత్సవాలకు మందిరాలు సిద్ధం చేస్తున్నారు. ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు.

ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి

సామర్లకోట: మండల స్థాయిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే కమిటీ నాయకులు ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మండల స్థాయిలో గణపతి శిబిరాలు ఏర్పాటు చేసే కమిటీ నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా శిబిరాల్లో ఏర్పాటు చేస్తున్న విగ్రహాల ఎత్తు, నిమజ్జనాలు చేసే తేదీలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.



కమిటీ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి

ఈ కార్యక్రమంలో ఎస్సై మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ఆంక్షలు తగవు

పిఠాపురం: గణేశ్ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఏవిధమైన ఆంక్షలు విధించవద్దని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితిని పురస్కరించుకొని కొన్ని లక్షల మందికి ఉపాధి లభిస్తుందని, జీవనాధారమైన, హిందువులంతా భక్తితో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు. సినిమా పాటలు, అశ్లీల నృత్యాలు, వికృత రూపాలతో గణేశ్ విగ్రహాలు లేకుండా ఛత్రపతి శివాజీ, బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో కులాలకు, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా ఈ ఉత్సవాలను నిర్వహించుకోవాలని తెలిపారు. మట్టి ప్రతిమలను పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఆయన పిలుపునిచ్చారు. గణేశ్ మంటపాలలో ఛత్రపతి శివాజీ, బాలగంగాధర్ తిలక్ చిత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి మణికుమార్, నాగాభట్ల లక్ష్మణశర్మ, బూరి సురేంద్రదత్త, ఈశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఊపందుకున్న వ్యవసాయ పనులు

ప్రత్తిపాడు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పంట సాగుకు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు ఇటీవల కాలం వరకు వరుణుడి కరుణ కోసం ఎదురు చూశారు. అల్పపీడనాల ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసి, రైతును మురిపించాయి. పొలాల్లో నీరు చేరడంతో ట్రాక్టర్లతో దమ్ము చేసి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్‌కు బదులుగా సరుగుడు వైపు రైతాంగం మళ్లింది.

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఉపందుకోవడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని వాకపల్లి, చింతలూరు, వెంకటనగరం, పోతులూరు, గోకవరం, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పెద్దిపాలెం, శరభవరం, గజ్జనపూడి తదితర గ్రామాల్లోని రైతులు వరి నాట్ల పనిలో బిజిబిజీగా ఉన్నారు. ఇప్పటికే ప్రత్తిపాడు, లంపకలోవ, ఏలూరు, టి రాయవరం తదితర గ్రామాల్లో వరి నాట్లు దాదాపు పూర్తి కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పంట ముంపులో ఉంటే మడుల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జోకా అమృత సూచించారు. ప్రస్తుతం 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయాలన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 2గ్రాములు కార్బోడోజెమ్‌ను ఎకరానికి 250 గ్రాముల మందును పిచికారీ చేయాలని ఆమె తెలిపారు.



పెదశంకర్లపూడిలో నాట్లు వేస్తున్న కూలీలు

భూ కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

కాకినాడ రూరల్: కూటమి భూ కబ్జాదారుల నుంచి తమకు రక్షణ కల్పించాలని సర్పవరం గ్రామానికి చెందిన నిమ్మన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. గ్రామంలోని నేరేళ్లమ్మ గుడి వీధిలోని సర్వే నంబర్ 6/4లో ఉన్న భూమిలో సుమారు 60 ఏళ్ళుగా సాగు, నివాసం ఉంటున్నామని, ఇప్పుడు భూ కబ్జాదారులు కొంత మంది రౌడీలను తీసుకువచ్చి తమపై దాడికి ప్రయత్నిస్తున్నారని నాగేశ్వరరావు తెలియజేశారు. సోమవారం స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా దాడి చేస్తున్నారని, కోర్టులో కేసు ఉండడంతో పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

రోడ్డు పక్కనే మద్యం బాబుల హల్‌చల్

- అటుగా ప్రయాణించాలంటే భయం.. భయం
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన ప్రజలు

బోట్‌క్లబ్: నిత్యం వందలాది మంది ప్రయాణించే చోట మద్యం బాబుల గలాటా ఓ పక్క, అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లు కారణంగా ఈ ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్, టీటీడీ కల్యాణ మండపం పక్క సందులో, దుగ్గిరాల వారి వీధి, గాడేపల్లి వారి వీధిలో వేళా పాళా లేకుండా రోడ్డు పక్కనే మద్యం తాగుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. నిత్యం వందలాది మంది తిరిగే ప్రాంతంలో ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో అనధికారికంగా బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకుని అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. నివాస ప్రాంతాలైన ఈ ప్రాంతంలో వాహనాల మరమ్మతుల కారణంగా రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో పాటు మద్యం బాబుల గలాటా కారణంగా మహిళలు ఈ ప్రాంతం వైపు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మద్యం బాబులు మలమూత్ర విసర్జన కూడా అక్కడే చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు ఈ ప్రాంతంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీ షాపులను తొలగించి మద్యం బాబులు ఇక్కడ మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో సోమవారం ఫిర్యాదు సైతం చేశారు. ఇక్కడ వారిని అదుపు చేయకుంటే తాము కాపురాలు చేయలేమని వారు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా కలెక్టర్‌కు వినతి ఇచ్చిన వారిలో లంక వెంకట శ్రీనివాసరావు, కె ఆదిత్య కుమార్, జనసేన నాయకులు సుంకర సురేష్, దేగల సురేష్ ఉన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ



కలెక్టర్‌కు అందించిన వినతిపత్రం చూపుతున్న టీటీడీ కల్యాణ మండపం వెనుక వీధి ప్రజలు



పట్టపగలు టీటీడీ కల్యాణ మండపం వెనుక వీధిలో ఆటోలో మద్యం తాగుతున్న మందుబాబులు

అనధికార నిర్మాణాలుపై కలెక్టరుకు ఫిర్యాదు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో గ్రామ పంచాయతీ తీర్మానంతో కూడిన ఫిర్యాదు పత్రాలను అందజేశారు. గ్రామంలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ అనుమతులు లేకుండా అనధికార బహుళ అంతస్తుల భవనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టి గ్రామ పంచాయతీకి చెల్లించవలసిన బిల్డింగ్ ఫీజు, పన్నులు కట్టకుండా రాజకీయ పలుకుబడితో నష్టం కలిగిస్తుందని, గడచిన 20 ఏళ్లలో సుమారు రూ.50 లక్షలు గ్రామ పంచాయతీ నష్టపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అచ్చంపేట జంక్షన్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఫంక్షన్ హాలుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



దవులూరి దొరబాబును కలసిన రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ మహిళా విభాగపు రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జి కె.జయసరిత అన్నారు. సోమవారం ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబును ఆమె మర్యాద పూర్వకంగా కలిసారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో మహిళా విభాగం కమిటీల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, వైఎస్సార్ సీపీ పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, రాష్ట్ర నాయకలు మామిడిశెట్టి చిట్టిబాబు, రామానుజుల చినమధు పాల్గొన్నారు.

దొరబాబు పరామర్శ

సామర్లకోట: మండల పరిధిలో వైఎస్సార్ సీపీకి చెందిన బాధిత కుటుంబాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు సోమవారం పరామర్శించారు. గొంచాల గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకట్రాయుడు తల్లి వీరమణి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వెంకట్రాయుడును కలసి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పి. వేమవరానికి చెందిన సీనియర్ పార్టీ నాయకుడు మునిరెడ్డి వెంకటేశ్వరరావు అల్లుడు ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించి తన సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ఉండూరుకు చెందిన కొప్పిరెడ్డి సూర్యప్రసాదరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు. చంద్రపాలెంకు చెందిన మండపాక వెంకటేశ్వరరావు మృతికి ఆయన కుటుంబ సభ్యులను కలసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఐదు అర్జీలు



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతీ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రతివారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఐదు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. దీనిపై సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేత్త పెండ్యాల నాగేశ్వరరావు మృతి



సామర్లకోట: వేట్లపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పెండ్యాల నాగేశ్వరరావు (85) సోమవారం మృతి చెందారు. ఉపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ చేసిన తరువాత వేట్లపాలెం కెనాల్ రోడ్డులో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన ఆయన 20 ఏళ్లగా ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయన ప్రతి గ్రామంలో భజన మండళ్ల ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే వారు. ఆయన సేవలను గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం, అన్నవరం దేవస్థానం అధికారులు ఆయన సేవలను వినియోగించుకోనున్నట్టు తెలిపారు.నాగేశ్వరరావు మృతికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి సంతాపం తెలిపారు.

మంత్రి ప్రగడ సత్రానికి ఫ్యాన్ల బహూకరణ



దాతలను సత్కరిస్తున్న బంగారు చినశోభనాద్రి సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: స్థానిక పెదమార్కెట్‌లో ఉన్న బంగారు చినశోభనాద్రి సత్రానికి కాకినాడకు చెందిన రిటైర్డు లెక్చరర్లు ఉప్పలూరి మురళి, స్వరాజ్యలక్ష్మి దంపతులు రెండు ఫ్యాన్లు సోమవారం అందించారు. దాతలను సత్రం ఈఓ చింతపల్లి విజయభాస్కర్ రెడ్డి సత్కరించారు. ఇక్కడ విద్యార్థులు మధ్యాహ్నం, రాత్రి ఉచిత భోజనం అందిస్తున్నామని విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మురళి దంపతులు ఫ్యాన్లు అందించారన్నారు.